క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రం



నకరికల్లు: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎస్.సురేష్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం మినరల్ వాటర్ చలివేంద్రం ప్రారంభించారు. తొలిరోజు మజ్జిగ, మినరల్‌వాటర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, ఆర్ఐ దావులూరి అనూషా, మారెళ్ల శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

త్రిశక్తి దుర్గాపీఠంలో ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీత్రిశక్తి దుర్గాపీఠంలో శుక్రవారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. పీఠాధిపతి వెలిదండ్ల హనుమంతరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇంటర్ పరీక్షకు 101 మంది గైర్హాజరు

సత్తెనపల్లి: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు శుక్రవారం 101 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలో ఏర్పాటు చేసిన మొత్తం ఐదు పరీక్ష కేంద్రాల్లో మూడో రోజు ఇంగ్లిష్ ప్రథమ సంవత్సర పరీక్షకు 1,617 మంది హాజరు కావాల్సి ఉండగా 1,516 మంది హాజరయ్యారు. 101 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్, జిల్లా కమిటీ సభ్యులు సందర్శించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోలేదు. 144 సెక్షన్ అమలు చేశారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి



అమరావతి: రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని పల్నాడు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఐ.మురళి చెప్పారు. శుక్రవారం మునగోడులో నిర్వహించిన గ్రామ సభలో ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు వేసిన పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేశామని, ఈకేవైసీ, ఈ-క్రాప్ నమోదు జాబితాలను మూడు రోజులుగా రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించామని పేర్కొన్నారు. ఎన్‌పీసీఐ లింక్, ఆధార్ అథంటికేషన్‌తోపాటు ఈక్రాప్ బుకింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో అహ్మద్ పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాల సాధనకు క్లాప్ మిత్రలే కీలకం



లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): స్వచ్ఛ గ్రామాలను తీర్చిదిద్దడంలో క్లాప్‌మిత్రలే కీలకమని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. లంకెలకూరపాడు గ్రామంలో కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో చెత్తసేకరణ, అనంతరం చేపట్టే విధానాన్ని పరిశీలించారు. కేంద్రంలో క్లాప్‌మిత్రలతో సమావేశమయ్యారు. వారితో కలిసి కాఫీ తాగారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈఓ ఒంగోలురాజు, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దేచవరం ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల



నకరికల్లు: దేచవరంలోని ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల శుక్రవారం జరిగింది. 28వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. అర్చకులు ఎల్.వెంకటకృష్ణమాచార్యులు, రాధాకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. స్వామిని విశేషంగా అలంకరించారు. భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయప్రాంగణం కిక్కిరిసింది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు పులిహోర, మజ్జిగ, మంచినీరు ఉచితంగా పంపిణీ చేశారు. భక్తసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

సత్తెనపల్లి కేంద్రంగా ఐసీడీఎస్

- పునర్విభజనతో కొత్త పరిధి
- సీడీపీఓగా శ్రీలత



పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ శ్రీలత, ఏసీడీపీఓ సంతోష్‌కుమారి

సత్తెనపల్లి: జిల్లాల పునర్విభజన వల్ల ప్రభుత్వ శాఖల పరిధులు మారుతున్నాయి. కొత్తగా ఏర్పడిన పల్నాడు జిల్లాలోకి సత్తెనపల్లి నియోజకవర్గం చేరి ఏడాది కావస్తుంది. ఇప్పటివరకు కార్యరూపం దాల్చని సమగ్ర శిశు అభివృద్ధి కార్యాలయాల (ఐసీడీఎస్) విభజన ప్రక్రియను తాజాగా ఉన్నతాధికారులు పూర్తిచేశారు. సత్తెనపల్లి కేంద్రంగా కొత్త ఐసీడీఎస్ ప్రాజెక్టును మంజూరు చేశారు. ఈ మేరకు ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రవిచంద్ర జీవో విడుదల చేశారు. పరిపాలనాపరమైన సౌలభ్యం నిమిత్తం నియోజకవర్గాల పరిధికి అనుగుణంగా మార్పులు చేసినట్లు అధికారులు తెలిపారు. కొత్త ప్రాజెక్టులకు సీడీపీవోలను నియమించటంతో వారు అధికారికంగా విధుల్లో చేరారు. సత్తెనపల్లి నియోజకవర్గం మొత్తం ఒకే ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోకి వచ్చింది.

- సత్తెనపల్లి నియోజకవర్గంలో సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాలు ఉన్నాయి. ఇప్పటివరకు సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్ మండలాలు ఫిరంగిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో, ముప్పాళ్ళ మండలం రాజుపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో, నకరికల్లు మండలం నరసరావుపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉండేవి.
- సత్తెనపల్లి నియోజకవర్గానికి సంబంధించిన సమగ్ర శిశు అభివృద్ధి సమాచారం ఏది కావాలన్నా మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టులను సందర్శించాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా నియోజకవర్గాల వారీగా ఐసీడీఎస్ ప్రాజెక్టులను విభజించారు.
- ఫిరంగిపురంలో ఉన్న సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్ మండలాలు, రాజుపాలెంలో ఉన్న ముప్పాళ్ళ, రాజుపాలెం మండలాలు, నరసరావుపేటలో ఉన్న నకరికల్లు మండలాన్ని సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు కిందకు తెచ్చారు. ఇక రాజుపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఉండదు.
- సత్తెనపల్లిలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం కొత్తగా ఏర్పాటు చేయనున్నారు. దీనికి గాను ఇప్పటికే నాలుగు ప్రతిపాదనలను ఆ శాఖ అధికారులు సిద్ధం చేసి ఉంచారు.
- సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓగా నాదెండ్ల ఏసీడీపీఓగా పనిచేస్తున్న టి.శ్రీలతను ఇక్కడికి బదిలీ చేశారు. అలాగే గ్రేడ్ వన్ సూపర్‌వైజర్‌గా ఉన్న టి.సంతోష్ కుమారికి పదోన్నతి కల్పించి సత్తెనపల్లి ఏసీడీపీఓగా నియమించారు. మిగతా సిబ్బందిని నియమించాల్సి ఉంది.
- సత్తెనపల్లి నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, ఒక పట్టణం కలిపి సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టుగా ఏర్పాటైంది. దీని పరిధిలో 303 అంగన్‌వాడీ కేంద్రాలు, రెండు మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.

నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల సమాచారం

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	మినీ అంగన్‌వాడీ కేంద్రాలు
సత్తెనపల్లిటౌన్	43	-
సత్తెనపల్లి రూరల్	76	-
ముప్పాళ్ళ	45	-
రాజుపాలెం	65	02
నకరికల్లు	74	-
మొత్తం	303	02

సత్తెనపల్లికి కొత్త ప్రాజెక్టు ఏర్పాటు



ఐసీడీఎస్ విభజన ప్రక్రియకు సంబంధించి ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై నియోజకవర్గం మొత్తం సత్తెనపల్లి ప్రాజెక్టు పరిధిలోకి వస్తుంది. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు పర్యవేక్షణ జరగనుంది. ప్రస్తుతం తనతోపాటు ఏసీడీపీఓ కూడా విధుల్లో ఉన్నారు. మిగిలిన సిబ్బంది నియామకాలు ఉన్నతాధికారులు చేపడతారు.

– టి.శ్రీలత, సీడీపీఓ, సత్తెనపల్లి

సత్తెమ్మతల్లి గుడి వద్ద ఎకో పార్క్



సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద చెక్‌పోస్ట్ టోల్‌గేట్ ప్రారంభిస్తున్న దృశ్యం

జిల్లా ఫారెస్ట్ అధికారి రామచంద్రరావు

అచ్చంపేట: సత్తెమ్మ తల్లి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, పర్యాటకులను ఆకర్షించేలా ఎకో పార్కును అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా ఫారెస్ట్ అధికారి రామచంద్రరావు తెలిపారు. మాదిపాడు మెయిన్ రోడ్డు నుంచి అడవిలో ఉన్న సత్తెమ్మ తల్లి ఆలయానికి వెళ్లే మార్గంలో శుక్రవారం చెక్‌పోస్ట్ టోల్‌గేట్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చెక్‌పోస్టు టోల్‌గేటును సత్తెమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్ గుడారి గోపి, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్ ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆలయ అభివృద్ధి, ఎకో పార్కు నిర్మాణానికి రూ.62 లక్షలు మంజూరు చేయించినట్లు చెప్పారు. ఈ నిధులతో ఆలయం వద్ద ఆఫీసు రూము, కమ్యూనిటీ హాలు, భక్తులకు విశ్రాంతి గదులు, స్నానాల గదులు, నీటివసతి తదితర సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. పార్కు అభివృద్ధికి, సిబ్బంది జీతభత్యాలకు కావలసిన నిధులను చెక్‌పోస్టు వద్ద ఉన్న టోల్‌గేటు నుంచి వసూలుకు అటవీశాఖ నుంచి అనుమతులు పొందినట్టు పేర్కొన్నారు. బైక్‌కు రూ.10, కారుకు రూ.25, లారీకి రూ.50 వసూలు చేసేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ వెంకటరామణ, డెప్యూటీ రేంజ్ అధికారి షేక్ ఖాజా రసూల్, మాదిపాడు సర్పంచ్ మాదా ఈశ్వరమ్మ, వెంకట్రావు దంపతులు, ఎంపీటీసీ స్వర్ణమ్మభాయ్, రమేష్‌నాయక్, ఉప ఎంపీపీ గంగసాని బాబు, జిల్లా బీసీ సెల్ కన్వీనర్ సాతర్ల శ్రీనివాసరావు, అచ్చంపేట సొసైటీ అధ్యక్షులు రామిశెట్టి చిన్న యల్లమందయ్య, ఆర్యవైశ్య జిల్లా నాయకులు దేవరశెట్టి శ్రీనివాసరావు, ఆలయ కమిటి సభ్యులు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులు యూనిఫాం ధరించాలి



వీఆర్వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్ సురేష్

నకరికల్లు: రెవెన్యూ ఉద్యోగులు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని తహసీల్దార్ ఎస్.సురేష్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఇతర గ్రామాలకు, ప్రాంతాలకు వెళ్లే సిబ్బంది మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేసి వెళ్లాలని సూచించారు. సాదా బైనామా పద్ధతిలో తెల్లకాగితంపై కొనుగోలు చేసిన భూములను ఫాం-13బీ ద్వారా క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, రైతులకు దీనిపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రజలకు ఆయా గ్రామాల వీఆర్వోలు పనివేళల్లో అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్ఐ సీహెచ్ పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి



బ్రాహ్మణపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దారు, ఎంఈఓ

రాజుపాలెం: గ్రామం పరిశుభ్రంగా ఉంటేనే గ్రామస్తులు ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దారు నళినీ తెలిపారు. బ్రాహ్మణపల్లిలో ట్రాన్సిట్‌వాక్‌ను అధికారులు శుక్రవారం నిర్వహించారు. తహసీల్దారు, ఎంఈఓ మల్లికార్జునశర్మ మండల స్థాయి అధికారులతో కలిసి గ్రామంలోని అన్ని వీధులనూ పరిశీలించారు. ఎంఈఓ గ్రామస్తులతో మాట్లాడుతూ ప్రతి పిల్లవాడూ బడికి వెళ్లేలా చూడాలని తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్‌ను, పాఠశాలను పరిశీలించి పిల్లల పరిశుభ్రతపై వాకబు చేశారు. గ్రామంలో ముగ్గురు బడి మానివేసిన పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి బడికి పంపేలా తహసీల్దార్ చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పగడాల ముక్కంటి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో అన్నింటా అభివృద్ధి



దేచవరం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేస్తున్న దృశ్యం

నకరికల్లు: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక విద్యారంగంతోపాటు అన్ని రంగాలు అభివృద్ధి సాధించాయని ఆ పార్టీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి చెప్పారు. దేచవరం గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించి శుక్రవారం ట్రాన్సిట్ వాక్ చేశారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్నభోజనం చేశారు. విద్యార్థుల్లో రక్తహీనతను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన కల్పించారు. ముందుగా కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమం నిర్వహించి గ్రీన్ అంబాసిడర్లను, క్లాప్‌మిత్రలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ గిరిధర్ పాల్గొన్నారు.

మార్చి 20లోపు అనుసంధానం పూర్తిచేయాలి



ఓటరు రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ భవానీశంకర్

ముప్పాళ్ళ: మార్చి 20లోపు ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను 90 శాతం పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామ ఆర్బీకేలో బూత్‌లెవల్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మొత్తం 34,302 మంది ఓటర్లు ఉండగా, 29,077 ఓటర్ కార్డులకు ఆధార్ అనుసంధానం పూర్తి చేశామని పేర్కొన్నారు. మొత్తం 84.77 శాతం అనుసంధాన ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన కార్డులకూ త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని వివరించారు. గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఇన్‌చార్జ్ ఆర్ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

లంకెలకూరపాడులో ఫ్యామిలీ ఫిజీషియన్



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ దివ్య

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): లంకెలకూరపాడు గ్రామంలో ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. పీహెచ్‌సీ వైద్యులు దివ్య, సూర్యప్రకాశరావు పాల్గొని 157 మందికి వైద్య సేవలందించారు. పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మనుతేజ, సూపర్‌వైజర్లు పీటర్‌డానియేన్, భవానికుమారి, ఏఎన్ఎం సౌజన్య, ఖాశింబి పాల్గొన్నారు.

గ్రామాల్లో అధికారుల పర్యటన



హసనాబాద్‌లో స్థానికులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి మోహన్‌బాబు



తాడువాయిలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న స్పెషల్ అధికారి మురళి తదితరులు

హసనాబాద్(క్రోసూరు): మండల ప్రత్యేక అధికారి జి.మోహన్‌బాబు, మండల పరిషత్ అభివృద్ధి ఇన్‌చార్జి అధికారి పి.శివరామయ్య, తహసీల్దార్ డి.శ్రీనివాసరావు శుక్రవారం హసనాబాద్, గాదెవారిపాలెం గ్రామాలను శుక్రవారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. సంపద కేంద్రాలను తనిఖీ చేశారు. క్లాప్‌మిత్రలతో మాట్లాడారు. కాఫీ విత్ క్లాప్‌మిత్రలో భాగంగా వారిని సత్కరించారు. హసనాబాద్, గాదెవారిపాలెం గ్రామాల్లోని జగనన్న హౌసింగ్ కాలనీల్లోని ఇళ్లను సందర్శించారు. గృహాల లబ్ధిదారులతో మాట్లాడుతూ త్వరగా ఇళ్లు కట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో హసనాబాద్ సర్పంచ్ షేక్ రహీం, గాదెవారిపాలెం సర్పంచ్ దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

తాడువాయిలో..

అచ్చంపేట: మండలంలోని తాడువాయిలో మండల ప్రత్యేక అధికారి ఐ.మురళి ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు శుక్రవారం పర్యటించారు. ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



తమ్మవరంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ ధనలక్ష్మి

కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, ఎంపీడీవో కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తమ్మవరంలో గ్రామోదయం

పెదకూరపాడు: తమ్మవరం గ్రామంలో గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి అధికారులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పల్నాడు జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ ధనలక్ష్మి పాల్గొన్నారు. ఆమెతోపాటు ఎంపీడీఓ నరసింహారావు, తహసీల్దార్ క్షమారాణి శుక్రవారం ఉదయం గ్రామంలో పర్యటించారు. గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు.

నదిలో మునిగి యువకుడి మృతి



షేక్ బాజీ(ఫైల్)

అమరావతి: మండల పరిధిలోని దిడుగు ఇసుకరీచ్ వద్ద ఓ యువకుడు కృష్ణానదిలో మునిగి మరణించిన ఘటన శుక్రవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం. దిడుగు గ్రామానికి చెందిన షేక్ బాజీ(22) శుక్రవారం ఇసుకరీచ్ వద్ద కృష్ణానదిలో స్నానం చేయటానికి బంధువులతో కలిసి వెళ్ళాడు. నదిలో లోతుకు వెళ్ళటంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మరణించాడు. గ్రామస్తులు, బంధువులు బాజీ కోసం సుమారు రెండు గంటలపాటు గాలించారు. బాజీ మృతదేహాన్ని వెలికితీశారు. ఘటనపై ఎటువంటి పోలీసు కేసు నమోదు కాలేదని ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.

11 మంది జూదరుల అరెస్ట్

బెల్లంకొండ: పేకాట ఆడుతున్న 11 మందిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్ఐ కె.అమీర్ తెలిపారు. పాపాయపాలెం గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడులు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడులలో పాపాయపాలెంకు చెందిన 10 మంది, వెంకటాయపాలెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.16,150 నగదును స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ వెంట హెడ్‌కానిస్టేబుల్ హుస్సేన్, కానిస్టేబుళ్లు ఎల్ వెంకటేశ్వరరావు, మల్లికార్జునరావు తదితరులు ఉన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

అమరావతి: గ్రామీణ ప్రాంతాలలో పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఎంపీపీ మేకల హనుమంతరావు చెప్పారు. శుక్రవారం అత్తలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశంలో అయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సమావేశానికి అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రవిబాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అత్తలూరు గ్రామ సర్పంచ్ బంకా సరోజిని, తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీఓ మాధురి పాల్గొన్నారు.

పన్నులపై వడ్డీ మాఫీ



కమిషనర్ కొలిమి షమ్మి

సత్తెనపల్లి: పట్టణంలో ఆస్తి, ఖాళీస్థలాల పన్నుపై ప్రభుత్వం వడ్డీ మాఫీకి అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిషనర్ షమ్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు పురపాలక సంఘాలలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల విషయంలో ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలు, ఈ ఆర్థిక సంవత్సరం పన్నుపై విధించిన వడ్డీని ఒకేసారి మాఫీ చేసినట్లు పేర్కొన్నారు. బకాయి మొత్తాన్ని ఒకే సారి ఈనెల 31 లోపు చెల్లించినట్టయితేనే వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని వివరించారు. మున్సిపల్ కార్యాలయంలోని పన్నుల వసూల కౌంటర్‌తోపాటు వార్డు సచివాలయాలలో చెల్లించవచ్చని, ఆన్‌లైన్ ద్వారా (https://cdma.ap.gov.in/) నెట్‌బ్యాంకింగ్ ద్వారా కానీ, డెబిట్ / క్రెడిట్ కార్డుల ద్వారా కానీ చెల్లించవచ్చునని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలపై ఆరా



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి సుధాకర్, ఎంపీడీవో సత్యనారాయణ

సత్తెనపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించడంలో నెలకొన్న లోపాలపై మండల అధికారులు శుక్రవారం ఆరా తీశారు. సత్తెనపల్లి మండలం దీపాలదిన్నెపాలెం గ్రామంలో గ్రామోదయంలో భాగంగా గురువారం రాత్రి మండల ప్రత్యేక అధికారి ఎ.సుధాకర్ నేతృత్వంలో అధికారులు పల్లెనిద్ర చేశారు. శుక్రవారం ఉదయం గ్రామంలో ట్రాన్సిట్ వాక్ నిర్వహించారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పని తీరు, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు పనితీరును పరిశీలించారు. కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు, ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వి.ప్రదీప్, సత్తెనపల్లి సీడీపీఓ టి.శ్రీలత, ఈఓపీఆర్డీ దయాసాగర్, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు, గృహ నిర్మాణ శాఖ ఏఈ సుబ్బారావు, పంచాయతీ రాజ్ శాఖ ఏఐ శివయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం 20న ధర్నా



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పెండ్యాల మహేష్ తదితరులు

సత్తెనపల్లి: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ఈనెల 20న జరుగుతున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) సత్తెనపల్లి మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలో చేపట్టిన ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి ఎం. హరిపోతురాజు, ప్రజాసంఘాల నాయకులు డి.విమల, జి.రజిని, గద్దె ఉమశ్రీ, పి.సూర్యప్రకాష్‌రావు, కె.జగన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుడిపై దాడి

నరసరావుపేట రూరల్: ఆటోలో ప్రయాణికుడిపై దాడిచేసి నగదు దోచుకెళ్లిన ఘటన మండలంలోని పమిడిపాడు సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు.. ముప్పాళ్ల మండల కేంద్రానికి చెందిన షేక్ మాబు సుభాని నరసరావుపేటలో అరటికాయల వ్యాపారం చేస్తుంటాడు. గురువారం రాత్రి 10.30గంటల సమయంలో పని ముగించుకుని ఇంటికి వచ్చే క్రమంలో కోటసెంటర్‌లో ఆటోల కోసం సుభాని వేచి ఉన్నాడు. ఆ సమయంలో ఆటోలో వచ్చిన ముగ్గురు యువకులు ముప్పాళ్లకు వెళ్తుందని నమ్మబలికారు. ములకలూరు దాటిన తరువాత ఆటోను పమిడిపాడు వైపు మళ్లించారు. కొంత దూరం వెళ్లాక ఆటో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు కలిసి ఒక్క సారిగా సుభానిపై దాడికి దిగారు. కేకలు వేస్తే చంపుతామంటూ బెదిరించి అతడి వద్ద ఉన్న రూ.2వేలు నగదు తీసుకెళ్లారు.

అనంతరం బాధితుడిని ములకలూరులో వదిలివెళ్లారు. తలపై, ముఖంపై తీవ్రగాయాలైన సుభాని స్థానికుల సహాయంతో తన బంధువులకు సమాచారం అందించాడు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.